ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



పెరిగిన కూర గాయాలు

- మొంథా తుపాను ప్రభావం అంటున్న రైతులు
- గుంటూరుకు సరుకు రావడం లేదు : వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మొథాన్ తుపాను ముగిసిన వెంటనే ధరలు పెరగడం విశేషం. నిన్న మొన్నటి వరకు ఉల్లిపాయాలు, టమోటా ధరలు తక్కువగా ఉన్నా ఆదివారం ఒక్కసారిగా వీటి ధరలు పెరిగాయి. రైతు బజార్ల ధరకు బహిరంగ మార్కెట్‌లో ధరలు కూడా భారీ వ్యత్యాసం ఉంటోంది. ఉల్లిపాయలు రైతు బజార్లలో కిలో రూ.24కి చేరుకోగా బహిరంగ మార్కెట్‌లో రూ.35కి చేరాయి. టమాటో రైతు బజార్లలో కిలో రూ.28 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.40 వరకు అమ్ముతున్నారు. మిగిలిన అన్ని రకాల కూరగాయాలు పెరిగాయి. ఆకు కూరల ధరలు గణనీయంగా పెరిగాయి. ఆకు కూరలు కట్ట ఏదైనా రూ.25 తక్కువ లేదు. రైతు బజార్లలో రూ.18 అని బోర్డు

2లో

వాటర్ షెడ్ పథకంపై జాతీయ సెమినార్

10,11న గుంటూరులో నిర్వహణ : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వాటర్ షెడ్ పథకంపై ఈనెల 10,11 తేదీల్లో గుంటూరులో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. వాటర్ షెడ్ డెవలప్మెంట్ ఆక్టివిటీలో భాగంగా గుంటూరు రూరల్ మండలం వెంగళాయ పాలెం గ్రామ చెరువును గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే రామాంజ నేయులుతో కలిసి పరిశీలించారు. జాతీయ సెమినార్‌కు సంబంధించిన సభా

2లో

పంటనష్టం అంచనాలు సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కంచుమాటి అజయ్‌కుమార్

మొంథాతుపానుకు నష్టపోయిన రైతులకు పంటల నష్టం అంచనాలు సక్రమంగా జరగలేదని, హడావుడిగా రైతుల జాబితాలు తయారు చేశారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అన్నారు. ఆదివారం బ్రాడీపేట లోని పిఎల్ రావు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు తయారు చేసిన రిపోర్ట్‌లో తక్కువ అంచనా వేశారని, పది రోజులు సమయం తీసుకొని అంచనా వేస్తే స్పష్టత వస్తుందని లేని పక్షంలో రైతులకు న్యాయం జరగదని అన్నారు. క్షేత్రస్థాయిలో పైర్ల దగ్గరే, పండించిన రైతుతో లిస్టు తయారుచేస్తే ఖచ్చితమైన రైతులు, కౌలు రైతులు తెలుస్తారన్నారు. దీనికి భిన్నంగా మొక్కుబడిగా నివేదికలు ఇచ్చారని,

2లో



పట్టాభిపురంలో కొవ్వుతుల ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

వరుస ఘటనలు జరుగుతున్నా చలనం లేదు

గుంటూరులో వైసిపి క్యాండిల్స్ ర్యాలీ - తొక్కిసలాట మృతులకు సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆలయాలకు వచే ప్రజలకు భద్రత కరువైందని వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తూ ఆదివారం రాత్రి స్థానిక పట్టాభిపురం స్వామి థియేటర్ నుంచి టిజెపిఎస్ కళాశాల వరకు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రాష్ట్రంలో పలు దేవాలయాలలో భక్తులకు రక్షణ లేక చనిపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస ఘటనలు జరుగుతున్న కూటమి ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. దేవాలయాలలో పర్వదినాల సందర్భంగా రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని అన్నారు.రానున్న రోజులలో ఇంకెన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందోనని అన్నారు. పార్టీ నగర

2లో

రాత్రి వేళ అనవసరంగా తిరిగితే కేసులు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో బహిరంగ మద్యపానం చేసినా, రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ పేర్కొన్నారు. రాత్రి వేళ 11 గంటలు దాటిన తరువాత అవసరం లేకుండా బయట సంచరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. శనివారం ఒక్క రోజే మొత్తం 513 మంది వ్యక్తులపై 477 కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, రోడ్లపై అనవసరంగా తిరుగుతూ ప్రజా రక్షణకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను పోలీస్ వారు అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు. టౌన్ న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న మొత్తం 301 మందిపై కేసులు నమోదు చేశామని ఆదివారం మీడియాకు తెలిపారు. అలాగే బహిరంగ మద్యపానం చేస్తున్న మొత్తం 212 మందిపై 176 కేసులు నమోదు చేశామన్నారు. నేరాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ బృందాలను మరింత బలోపేతం చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, సాంకేతిక పరికరాలను ఉపయోగించి అప్పటికప్పుడే వారి వేలిముద్రలను పరిశీలించి అనుమానంగా ఉంటే పోలీస్ స్టేషన్ కి తరలిస్తామన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్స్, హిస్టరీ సీట్లు కలిగిన వారు, పాత కేసుల్లోనీ నేరస్తులు ఏవైనా సంఘటనల్లో పాల్గొంటే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గుండిమెడ వైపు వెళ్ళు రహదారిపై గండిని పరిశీలిస్తున్న వై నేతాజీ తదితరులు

శాశ్వత ముంపునివారణ చర్యలు చేపట్టాలి

రాకపోకలకు అంతరాయం లేకుండా కల్వర్టు నిర్మించాలి : సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఎం.టి.ఎం.సి పరిధిలోని కేఎల్ యూనివర్సిటీ నుండి గుండిమెడ వైపు, కుంచనపల్లి నుండి ప్రాతూరు, గుండి మెడ గ్రామాల పంట పొలాల రహదారులపై కల్వర్టు నిర్మాణాలు చేపట్టాలని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం గుండి మెడ సిపిఎం నాయకులతో కలిసి ఆయన పంట పొలాలలో వ్యర్థపు నీరు బయటకు పోయేందుకు రహదారిపై రైతులు గండి కొట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ గత రెండు నెలల కాలంగా అనేకసార్లు అధిక, భారీ వర్షాలు కురవడం వలన తాడేపల్లి మండలంలోని కుంచనపల్లి, గుండిమెడ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, చిర్రావూరు తదితర గ్రామాలలో పంట పొలాలలో వర్షపు నీరు నిలిచిపోయిందన్నారు. పొలాలలో ఉన్న డ్రైనేజీ కాలువలు పూడుకుపోవడమే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. మంగళగిరి వైపు నుండి వడ్డేశ్వరం మీదగా గుండిమెడ, చిర్రావూరు, తదితర

2లో

బ్యారేజీకి కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతుంది. ఆదివారం రాత్రి 9 సమయానికి ఎగువ ప్రాంతాల నుంచి బ్యారేజ్ వద్ద 1,58,175 క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో బ్యారేజీ 69 గేట్లలో 29 గేట్లను నాలుగు అడుగులు, 44 గేట్లను మూడు అడుగుల మేర పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులుగా ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. కృష్ణా డెల్టా ప్రధాన కాలువలకు నీటి విడుదల నిలిపివేశారు.

కవితల పోటీల్లో రఘునందన్‌కు బహుమతి

ప్రజాశక్తి - తిరువూరు : శ్రీహరి కోటలోని షార్ వాణి మాసపత్రిక యాజమాన్యం ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో తిరువూరుకు చెందిన ప్రముఖ కవి రేపాక రఘునందన్ రచించిన 'వాన ప్రేమించిన క్షణాలు' కవితకు తృతీయ బహుమతి లభించింది. ఈ మేరకు పత్రిక ప్రధాన సంపాదకుడు గారపాటి సూర్యనారాయణ సమాచారం పంపినట్లు రఘునందన్ తెలిపారు. గతంలో కూడా అనేక జాతీయ పోటీల్లో బహు మతులు గెలుచుకున్న రఘునందన్ ప్రస్తుతం అరసం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా, తిరువూరు రచయితల సంఘం (తిరసం) ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. రఘునందన్‌కు జాతీయ స్థాయిలో బహుమతి రావడం పట్ల తిరసం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



చిన్నారుల ప్రతిభకు పట్టం

విజయవాడ : రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో "నృత్యహేల - 2025" కార్యక్రమం ఆదివారం సాయంత్రం గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ప్రముఖ నాట్యాచార్యులు అనూషానాయుడు, అనిత, నరేంద్ర కుమార్ తదితర గురువుల వద్ద శిష్యరికం చేస్తూ విశేష ప్రతిభ కనబరుస్తున్న 30 మందికి పైగా చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, స్వర్ణ నంది, నర్తనమయూరి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ప్రముఖ నాట్యాచార్యులు సప్పా శివకుమార్ నిర్వహించారు. ప్రముఖ నాట్యాచార్యులు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, ఎం. త్రినాథాచారి, ఘంటసాల పవన్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

8న ఇళయరాజా సంగీత కచేరీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాష్ట్రంలో మొదటిసారిగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మ్యూజికల్ కన్సర్ట్ విజయవాడలో జరగనుంది. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించను న్నారు. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కచేరీకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. రాజధాని అమరావతికి సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని, నగర ఖ్యాతిని మరింత పెంచేందుకు ఇది దోహదపడుతుందని సంస్థ ఆర్గనైజర్ పద్మనాభుని సుధాకర్ తెలిపారు. ఇళయరాజాతో కలిసి ఎస్పీ చరణ్, హరిచరణ్, మధుబాలకృష్ణన్, జితేంద్ రాజ్‌తోపాటు మరో 10 మంది ప్రముఖ గాయకులు పాల్గొంటారు. 70 మంది సంగీతకారుల బృందం సహకారంతో సంగీత ప్రియులకు ఆహ్లాదకరమైన అనుభవం అందనుంది. నగరంలో ఇళయరాజా కటౌట్‌ను ఏర్పాటు చేసి, కళాకారులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగర్స్ సాయి సిద్ధార్థ, కళ్యాణి, ఈశ్వర్, కిషోర్, సత్య, పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ముంపునివారణ చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల రైతులు, ప్రజలు ప్రయాణం చేసే కేఎల్ యు సమీపాన ఉన్న రహదారి పై గండ్లు కొట్టడం వలన ప్రజలకు రాకపోకల అంతరాయం ఏర్పడిందన్నారు. నిత్యం రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజానీకం ప్రయాణం చేసే రోడ్డు, వర్షపు నీరు పోయేందుకు రైతులు గండి కొట్టి 40 రోజులు దాటుతున్న ప్రభుత్వ అధికారులు సమస్యను పరిష్కరించలేదని ఆయన విమర్శించారు. తక్షణమే నిత్యం రాకపోకలు సాగించే కేఎల్‌యు గుండిమెడ రోడ్డుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. మురుగునీరు పంట పొలాలలో నిలువ లేకుండా డ్రైనేజీ కాలువలను పూడికలు తీయించి పంట పొలాలను రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, గుండె మెడ సిపిఎం కార్యదర్శి నాగ పోగు విజయరాజు, గుడివాడ సామ్య వాదం, బత్తుల సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం అంచనాలు సక్రమంగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా అక్టోబర్ 30వ తేదీలోపు 60 వేల ఎకరాల్లో జిల్లాలో నష్టం జరిగిందని అధికారులు అంచనాలు వేయగా, నేడు ఇస్తున్న అంచనాలు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. పంటల బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వదిలేస్తే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని చేయకపోవడం వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. శాతం పేరుతో గుర్తించటం సరైన పద్ధతి కాదని, 20 శాతం నుంచి పంట నష్టం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వరికి, పత్తికి రూ.25వేలు, అపరాలకు రూ.10వేలు, ఉద్యాన పంటలకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యవసాయ మంత్రి రైతులందరినీ ఆదుకుంటావని ప్రకటన చేయడమే కాకుండా న్యాయబద్ధమైన నష్టపరిహారం అందిం చాలని ఆయన కోరారు. తుఫాన్‌కు దెబ్బతిన్న పత్తి పంటను నిబంధనలు సడలించి, ఆంక్షలు లేకుండా మద్దతు ధర ప్రకారం అన్ని మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టి కొనుగోలు చేయాలన్నారు. అదే విధంగా గతేడాది పొగాకు రైతుల నుండి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన నిధులు తక్షణమే రైతులకు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బిక్కి శ్రీనివాసరావు, తలసీల సుధాకర్ పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పథకంపై జాతీయ సెమినార్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణ ఏర్పాట్లను ఎమ్మెల్యేతో కలిసి పెమ్మసాని పరిశీలించారు. పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ గ్రామీణాభివద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన వాటర్ షెడ్ పథకాన్ని కరువు ఎక్కడ ఉంటుందో అక్కడ భూగర్భ జలాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే ఈ పథకాన్ని గుంటూరు చుట్టుపక్కల ప్రాంతంలో అవకాశం లేక గ్రామీణ ప్రాంతంలో ఉన్న వెంగలాయపాలెం చెరువును ఎంపిక చేశామన్నారు. ఒక సమగ్రమైన వాట్ కింగ్ ట్రాక్, కమ్యూనిటీని ఎంగేజ్ చేసే విధంగా ప్రయత్నిస్తున్నామని వివరించారు. రూ. 1.2 కోట్లు ఖర్చు చేసి ఒక ఎంట్రన్స్ ప్లాజా, పార్కింగ్ ఏరియా, ఓపెన్ జిమ్, పిల్లల ఆటస్థలం, కమ్యూనిటీ గెదర్ ఏరియా, గెజిబో వంటి అన్ని సౌకర్యాలను కల్పించి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. 300 కొబ్బరి చెట్లు, చేపల పెంపకం ద్వారా చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. ఒక పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టుకు 10 - 11వ తేదీలలో గుంటూరులో నేషనల్ వాటర్ షెడ్ కాన్ఫరెన్స్ ను నిర్వహించబోతున్నామని వివరించారు. కేంద్ర కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు అధికారులు ఈ సెమినార్‌కు వస్తారని తెలిపారు. 10 రోజుల్లో యుద్ధప్రాతిపదికన ఎమ్మెల్యే బీ. రామాంజనేయులు, గ్రామీణాభివద్ధి అధికారులు కలిసి సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేస్తున్నారని తెలిపారు. 11వ తేదీన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో సభ జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రాయలసీమ వంటి ప్రాంతాల్లో వాటర్షెడ్ పథకం ఉపయోగించుకోవడం అనేది చాలా గొప్ప అంశమన్నారు. భూమిలోని నీరు అతి తక్కువ లోతులోనే అందుబాటులో ఉండాలని ప్రణాళిక ప్రకారం ఈ వాటర్షెడ్ పథకం లక్ష్యం అన్నారు. భూగర్భ జలాలు సమద్ధిగా అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో ఈ పథకానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూపకల్పన చేసినట్టు తెలిపారు.

వరుస ఘటనలు జరుగుతున్నా చలనం లేదు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షురాలు నూరి ఫాతిమా మాట్లా డుతూ అధిక సంఖ్యలో ప్రజలు రాగా భద్రతా లోపాల వలన తొక్కిసలాట జరిగిందని, ఈ తొక్కిసలాటలో 9 మంది ప్రాణాలు కోల్పోయారని,కొంతమంది భక్తులు గాయపడ్డారని ఇటువంటి దుర్ఘటన దురదృష్టకరమని అన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూర గాయాలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. రైతు బజార్లలో కూడా బోర్డులో ఉన్న ధరలు అమలు కావడం లేదు. వంకాయ రూ.62, బెండ రూ.44, కాకర రూ.50, బీర రూ.44, క్వాలీఫ్వవర్ రూ.30, క్యాబేజి రూ.28, క్యారెట్ రూ.74, దొండ రూ.40, బంగాళదంపలు రూ.28, గోరుచిక్కుడు రూ.44, దోస రూ.22, సొరకాయ రూ.30, పొట్ల రూ.32, అరటి రూ.7, పెద్ద చిక్కుళ్లు రూ.114, బీన్స్ రూ.74, క్యాప్సికం రూ.74 లు గా అధికారులు నిర్ధారించారు. గత వారం రోజుల్లో ఈ ధరలు ప్రతి వెరయిటీకి బాగా పెరిగాయని వినియోగదారులు వాపోతున్నారు. ప్రధానంగా వంకాయ, బెండ, దొండ, క్యారెట్ తదితర రకాలకు గత రెండు నెలల్లో ఉన్న ధర రెట్టింపు అయింది. గత నెలలో ఉల్లి రూ.11 అమ్మగా ఇప్పుడు రూ.24, గత నెలలో టమాటో రూ.20 ఉండగా ఈనెలలో రూ.28కి పెరిగాయి. కర్నూలు,చిత్తూరు జిల్లాల్లో ఉల్లి, టమాటో ధరలు పడిపోయి కొనే నాథుడు లేక రైతులు అల్లాడుతుండగా ఇప్పుడు మార్కెట్‌లోకి వచ్చిన సరుకు ధరలు బాగా పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా మార్కెట్‌కు సరుకు రావడం తగ్గడంతో వ్యాపారులు ధరలు పెంచారు. మొంథాన్ తుపానకు కూరగాయాల తోటలు దెబ్బతినడంతో సరుకు రావడం తగ్గింది. అలాగే కర్నూలు జిల్లా నుంచి ఉల్లిపాయాలు, చిత్తూరు నుంచి టమోటా రావడం కూడా తగ్గడం వల్ల స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు అంతా సిండికేట్ అయి ధరలు పెంచారని రిటైలర్లు చెబుతున్నారు. బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి గుంటూరు రావాల్సిన వివిధ రకాల వెరయిటీలు రావడం ఆగిపోవడం వల్ల ఇతర కర్నాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి తీసుకురావడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయాల తోటలు దెబ్బతినడం, నీటిలో మునిగిపోవడం వల్ల ఉత్పత్తులు పాడై పోవడంతో సరుకు రావడం తగ్గింది. అంతేగాక మార్కెటింగ్ శాఖ అధికారులు పరిశీలన కూడా లేకుండా పోయింది. మార్కెట్‌లోకి ఏయే రకాల వస్తువులు రావడం ఆగిపోయిందో..ప్రత్యామ్నాయంగా ఎక్కడ నుంచి తీసుకురావాలన్నదీ ఇంకా ప్రణాళికలు రూపొందించకపోవడంతో ధరలు పెరిగి వినియోగదారులు వాపోతున్నారు.

అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై ప్రత్యేక దృష్టి


ప్రజాశక్తి-విజయవాడ :

రాజ్యాంగ నిర్మాత, దేశాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని.. ఆయన ఆశయాలను, మేధో సంపత్తిని తరతరాలకు అందించేందుకు ఆయన పేరిట ఏర్పాటు చేసిన స్మృతివనం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, మహనీయునికి విశిష్ట గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రలతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్మృతివనం నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి చోటులేదని, ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంస్థను ఆదేశించామని తెలిపారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. స్మృతివనం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా నిరంతర అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు, ఏపీఐఐసీ, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భావి తరాలకు తెలుగు భాష వారసత్వ సంపద

- తెలుగు అకాడమీ చైర్మన్ శరత్చంద్ర

విజయవాడ : ఘన చరిత్ర కలిగిన తెలుగు భాష వారసత్వ సంపదను భావితరాలకు సమున్నతంగా అందించనున్నామని తెలుగు అకాడమీ చైర్మన్ శరత్చంద్ర పేర్కొన్నారు. గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాషను రక్షించుకోపోతే భావితరాలు క్షమించవన్నారు. తెలుగు భాష చరిత్ర, కళలు, సాహిత్యాన్ని విస్తతంగా జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రఖ్యాత సాహిత్యాన్ని పునర్ముద్రించడానికి కూడా అకాడమీ పూనుకోనున్నదని వెల్లడించారు. తెలుగు భాష వినియోగాన్ని సగర్వంగా భావించాలని సూచించారు. భాషకు సంబంధించి సంధి కాలంలో ఉన్న ప్రస్తుత తరుణంలో భాష అభివద్ధికి సమైక్యంగా పూనుకోవాలన్నారు. తెలుగు భాషోద్యమ నాయకులు డాక్టర్ సామల రమేష్ బాబు మాట్లాడుతూ తెలుగుజాతి ఐక్యతకు మహోద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, నెల్లూరు జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. సనాతన ధర్మ ధర్మాచరణ పరిషత్ అధ్యక్షులు జి.కె.ఆర్. నాగభూషణరావు తదితరులు కూడా ప్రసంగించారు. సమైక్య భారతి, ఏపీ తెలుగు భాష పరిరక్షణ సమితి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు కళావాహిని, కా. జి ఆర్ కె - పోలవరపు



సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సహకరించాయి. ఆహ్వాన సంఘం సమన్వయకర్త పి. కన్నయ్య నేతత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలను ఆలపించారు. సీహెచ్.చిట్టిబాబు, కె.డేవిడ్ రాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తెలుగు చలనచిత్ర సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు సినీ సంగీత విభావరి కూడా నిర్వహించారు.



ఎన్నికైన సభ్యులను సన్మానించిన సంఘ నాయకులు

మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘ సమావేశం

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని చీలిపాలెం గ్రామంలో ఆదివారం మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం మాస్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులుగా వేజెండ్ల సుధాకర్, చేబ్రోలు మండల అధ్యక్షులుగా కొక్కిలిగడ్డ సురేష్, పొన్నూరు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పందిటి బాపయ్యను నియమించినట్లు మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ సంఘం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ మాదిగ జాతి పేద విద్యార్థుల అభివృద్ధి కోసం పని చేస్తోందన్నారు. సొసైటీ నిధులతో నిరుపేద కుటుంబంలో ఉన్న మాదిగ పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో మాస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక నాయకులు అద్దేపల్లి రవీంద్ర (చంటి), ఆరమళ్ళ రమేష్ , మల్లెల సంసోను , రత్నరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంచుఐజాక్ అధ్యక్షత వహించిన సమావేశంలో ముఖ్య అతిథులు ఏపిఎం బాబు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనంలో జాతి బిడ్డల అభివృద్ధి కోసం ఆలోచన విధాలను పంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో అందరికీ ఆమోదయోగ్యమైన కమిటీ హాల్ను సంఘంగా అభివృద్ధి చేసుకొని రీడింగ్ రూమ్‌గా ఉపయోగించే విధంగా అందరూ ఆర్థికంగా చొరవ చూపాలని నిర్ణయించామని చెప్పారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీత పొన్నూరు వెలుగు ఏటీఎం జోయి బాబును సత్కరించారు. కార్యక్రమంలో సౌపాటి వెంకటరావు, కె.రాజేంద్ర, అశోక్, నియోజక వర్గంలోని మూడు మండలాల మాదిగ యువత విద్యార్థులు, ఉద్యోగులు, పెద్దలు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని ఎండుగుంపాలెం నుంచి కోమటినేని వారిపాలెంకు వెళ్ళే దారిలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై నాదెండ్ల ఎస్ఐ జి.పుల్లారావు నేతృత్వంలో మెరుపు దాడి చేశారు. 26ద్విచక్రవాహనాలు, రూ. 19, 600లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి అక్కడి నుంచి కొంతమంది పారిపోగా 15 మందిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

బైక్ ధ్వంసం పై కేసు నమోదు

ప్రజాశక్తి - తెనాలి

స్వల్ప విషయంలో బైక్ ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు స్థానిక ఐతానగర్‌కు చెందిన బోడపాటి భాగ్యరాజు బైక్‌ను రాత్రి వేళల్లో ఇంటి సమీపంలో పెడుతుంటాడు. రోజు అతని బైక్‌లో పెట్రోల్ తగ్గుడుండడంతో అదే ప్రాంతంలో నివసించే యువకుడు రాహుల్‌ను ఈ విషయమై ప్రశ్నించాడు. రాహుల్ ఈ విషయాన్ని అతని స్నేహితుడు అక్షయ్‌కు చెప్పాడు. దీనిపై అక్షయ్ ఆగ్రహించి భాగ్యరాజ్ బైక్‌ను ధ్వంసం చేశాడు. ప్రశ్నించిన భార్యరాజుపైనా దౌర్జన్యం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

5న సాలూరి రాజేశ్వరరావు స్మారక సంగీత విభావరి

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 5న స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి వీరనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక నాజరు పేటలోని వివేకస్కూలు లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసురావు సారథ్యంలో వర్ధమాన యువ గాయనీమణులు సాహితీచాగంటి, సౌమ్యచే సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాహితీ చాగంటికి ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు అవార్డు, గాన కోకిల బిరుదు ప్రదానం చేస్తారని తెలిపారు. గాయనీ గాయకులు, కళాభిమానులు కళాకారులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీరనారాయణ కోరారు. కార్యక్రమంలో ఫిలిం సొసైటీ కార్యదర్శి బొల్లి ముంత కృష్ణ, ఐజేయూ సభ్యులు ఓతుకోలు మార్కండేయులు, సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కంకిపాటి రమేష్‌కుమార్, బి.సుధాకర్, బెల్లంకొండ వెంకట్, ఈపూరి ప్రేమ్‌కుమార్, ఎం.వి రఘునాథరావు, సిహెచ్ శ్రీదేవి, కన్నెగంటి మౌనిక, ఎం.బద్రీనాథ్, ఎస్.డి. రిహాన్, మాణిక్యాలరావు,మురళి పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కల్చరల్ ఫిలిం సొసైటీ బృందం

గాయపడిన దళితుడికి అండగా మాస్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దళితుల ఆత్మరక్షణకు మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం అండగా నిలుస్తుందని మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు అన్నారు. ఇటీవల రైల్వే కానిస్టేబుల్ దాడిలో గాయపడిన జాయ్ బాబుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని మాస్ నేతలు హామీ ఇచ్చారు. ఆదివారం మార్కెట్ సెంటర్‌లోని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం కార్యాలయంలో బాధితుడు దేవిశెట్టి జాయ్‌బాబుకు సుద్దపల్లి నాగరాజు రూ.55వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ జాయ్ బాబుపై అత్యంత దారుణంగా దాడి చేసిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసు కోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థిక సహాయాన్ని అందించిన దాతలు అక్బర్, సాయి, గోపి, కూచిపూడి మోహన్ మాదిగకు ధన్యవాదాలు తెలిపారు. కొలకలూరి కిరణ్ కుమార్, మాస్ నాయకులు కోట్ల దిలీప్,ఉన్నం భూషణం, లింగాల రమేష్, రావూరి సతీష్, చావలి ఆనంద్, టి.శ్రీధర్ పాల్గొన్నారు.

పిడిఎస్ రైస్ అక్రమ రవాణా మానుకోండి

కేసులు నమోదైన వారికి నిర్వహించిన కౌన్సిలింగ్‌లో సిఐ ఎస్ సాంబ శివరావు

ప్రజాశక్తి - తెనాలి

పేదలకు అందాల్సిన బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ ఎస్ సాంబ శివరావు హెచ్చరించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణాకు పాల్పడి, గతంలో కేసులు నమోదైన వారిని ఆదివారం స్టేషనుకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరెవరిపై ఎన్నెన్ని కేసులు నమోదయా యన్న వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రవర్తన మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని చెప్పారు. దాదాపు 20 కేసులలో నిందితుడైన వ్యక్తిని ఉద్దేశించి మాట్లాడుతూ రౌడీ షీట్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రక్రియలో ఎస్సైలు కరిముల్లా, ఎన్ ప్రకాశరావు సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సిఐ సాంబశివరావు

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్...

స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను కూడా స్టేషన్కు పిలిపించి సీఐ సాంబశివరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, రౌడీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

బలసాని సౌజన్యంతో తుపాను బాధితులకు సాయం

ప్రజాశక్తి - పెదనందిపాడు

కాకుమాను మండలం రేటూరు గ్రామంలో ఇటీవల సంభవిం చిన తుపాను కారణం వలన, నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే విషయంలో తమ పార్టీ వారు కాదన్న ఉద్దేశ్యంతో 75 కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వలేదని నాయకులు ప్రత్తిపాడు నియోజక వర్గ వైసిపి ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బాధితుల కుటుంబాలకు అన్యాయం జరగకూడదని వారికి అండగా నిలిచి, నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ వాలంటీర్ విభాగం నాయకులు వల్లూరి సుధాకర్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. తుపాన్ బాధితులకు ప్రభుత్వం తరపున అండగా ఉండాల్సింది పోయి, కేవలం వారు వైసీపీకి ఓటు వేశారన్న కారణంతో వారికి అందవలసిన నష్టపరిహారాన్ని నిలిపివేశారని అన్నారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందించారు అని తెలిపారు. కార్యక్రమంలో, కాకుమాను మండల వైసిపి కన్వీనర్ కొమ్మాలపాటి రవికుమార్, కట్టా మోహన రావు, గేరా పున్నారావు, కానుగల పరమేశ్వరావు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు సరుకులు అందజేస్తున్న వైసిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఫిరంగిపురం - వేములూరిపాడు గ్రామాల మధ్య గుంటూరు కర్నూలు రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన షేక్. అసుదుల్లా(50) కొత్త పెట్రోల్ బంకు వద్ద గల కోహినూర్ హోటల్ దగ్గర నుంచి నడుచుకుంటూ వేములూరిపాడు స్వగ్రామానికి వెళ్లే క్రమంలో పద్మావతి బ్రిక్స్ కంపెనీ, నూతన అట్ల ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అసుదుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. మతుడు అసుదుల్లా భార్య షేక్.ఆస్మా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐశివరామకష్ణ తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు

పోలీసుల కార్డెన్ సెర్చ్

మారణాయుధాలు, వాహనాలు సీజ్

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల మండలం, సాతులూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున 5 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు గ్రామంలో 120 మంది పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 28 వాహనాలను సీజ్ చేయడంతో పాటు పెద్ద మొత్తంలో మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరి గాయి. డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు పంపే టప్పుడు వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని తెలిపారు. గంజాయి మత్తు పదార్థాలపై ప్రజలకు అవగా హన కల్పించారు. పోలీసులు ఇంటింటికి వెళ్లి ప్రతి గృహాన్ని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్డెన్ సెర్చ్‌లో చిలకలూరిపేట సీఐ సుబ్బరాయుడు నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు కలెక్టర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కు వచ్చే అర్జీదారులు 'మీ కోసం' కాల్ సెంటర్ నంబర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు meekosam. ap. gov.in వెబ్‌సైట్లో వారి అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కొండయ్య

ఎల్ఐసి డివిజన్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - విజయపురి సౌత్

లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం డివిజన్ కౌన్సిల్ ఈసి సమావేశం నాగార్జున సాగర్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా దివంగత నాయకులు స్టాలిన్‌బాబు, సోమయ్యకు నివాళులు అర్పించారు. స్టాలిన్ బాబు ఏజెంట్స్ సమస్యలు, ప్రజాసమస్యల పరిష్కారానికి జనంలో నడయాడిన వ్యక్తి అని అలిండియా సెక్రటరీ జనరల్ మార్కొండయ్య పేర్కొన్నారు. సభకు డివిజన్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు, జోనల్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ, రవీంద్ర రెడ్డి, డివిజన్ జనరల్ కోశాధికారి జగన్నాధం, డివిజన్ రెసిడెన్సీ సెక్రటరీ ఎస్. రఘు, ఆల్ ఇండియా ఈసి మెంబర్ రామచంద్రరావు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అలిమియా, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మారుతి, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఈజె ప్రకాష్ గురజాల అధ్యక్షులు మునీశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమిషన్ తగ్గింపు విషయంగా దేశవ్యాప్తంగా యూనియన్ పోరాటంపై చర్చించారు. తీర్ గ్రాట్యూటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంపు, స్థానిక బ్రాంచ్ సమస్యలు పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అన్నీ బ్రాంచ్ నాయకులు ఏజెంట్లు పాల్గొన్నారు.



విడుదల అయిన నీరు

పులిచింతలకు 52532 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఒక యూనిట్ ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.667 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్లు, 2 గేట్లను మీటర్ మేర ఎత్తి 6 క్రస్ట్ గేట్ల ద్వారా 48244 క్యూసెక్కులు, టేల్ రేస్ ఛానల్ ద్వారా 4288 మొత్తంగా 52532 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన వున్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 65600 క్యూసె క్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్లో 75.09 మీటర్లమేర నీరుండగా ఈ నీరు 6,799 టీఎంసీలకు సమానమన్నారు.

నిరుపయోగంగా వాహనాలు, యంత్రాలు

లక్షల రూపాయలు ప్రజాధనం వృథా... పట్టించుకోని అధికారులు



తహశీల్దార్ కార్యాలయంలో పాడైపోయిన కారు



ఉపయోగంలోలేని 22 చెత్త వాహనాలు



పాడైన ఆరబెట్టే యంత్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల లక్షల రూపాయల ప్రజల సొమ్ముతో కొన్న వాహనాలు, యంత్రాలు ఎండకు ఎండి వానకు తడిచి వృథాగా ఉండి పోతున్నాయి. చివరికి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. అందుకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎప్పుడో కొన్న జీపు, వ్యవసాయ మార్కెట్‌యార్డులో వరి రైతుల అవసరల కోసం ఎప్పుడో కొన్న తడిసిన ధాన్యాన్ని ఆవిరి పెట్టె యంత్రం సాక్ష్యాలుగా మిగిలాయి. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారు లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ధాన్యపు ఆరబోత యంత్రం శిథిలమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 2014-15లో అప్పటి ప్రభు త్వం వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వరి రైతుల అవసరాల కోసం యంత్రాలను తెప్పించింది. నియోజకవర్గ పరిధిలో తడి ధాన్యాన్ని ఆరబెట్టి వరి రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు రూ.18లక్షలతో నాలుగు చక్రాల ట్రైలర్పై బిగించిన డ్రయర్, జనరేటరును అందుబాటులో ఉంచారు. అయితే దీనిపై రైతులకు అవగాహన కల్పించి వాటిని ఉప యోగంలోకి తేలేకపోవడం వల్ల నిరుపయోగంగా మారింది. అదేమాదిరి తహశీల్దార్ కార్యాలయంలో షెడ్లో ఉన్న జీపు పాడైపోతున్నా పట్టించుకోవడం లేదు. వాటిని టెండర్ల ద్వారా అమ్మితే వచ్చే డబ్బు ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని పలువురు భావిస్తున్నారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పూర్తిగా తుప్పు పట్టి టైర్లు గాలిపోయి పూర్తిగా పనికిరాని స్థితికి చేరింది. ఇప్పటికైనా నూతన ఛైర్మన్, సెక్రటరీ పట్టించుకుని బాగు చేయిస్తే పనికి వచ్చే అవకాశముంది. లేదా మాగాణి ఉన్న మరో మార్కెట్ యార్డుకైనా తరలించాలని రైతులు కోరుతున్నారు.

తడిసి ముద్దవుతోన్న తెల్ల బంగారం



తుపాను వల్ల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్ ప్రారంభంలో తొలకరి వర్షాలకు పత్తి సాగు చేసిన రైతులకు కష్టం వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు చేతికందుతున్న పత్తి నేల రాలుతోంది. పల్నాడు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి అధిక మొత్తంలో సాగు చేశారు. పత్తి సాగుదారులలో అత్యధికంగా కౌలు రైతులు ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వాతా వరణంపత్తి సాగుకు అనుకూలంగా ఉండటంతో జిల్లా వ్యాప్తంగా 2.01 లక్షల ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఎకరాకు రూ.వేలల్లో పెట్టుబడి పెట్టారు. పత్తి ఏపుగా పెరిగి కాయ, పూతతో ఉన్న సమయంలో మొంథా తుపానుతో పత్తి చేలల్లో నీరు నిలిచి ఎర్రబారి పోతున్నాయి.

రాలిపోతున్న కాయ, పూత

పత్తి పంట కీలక దశలో ఉన్న ఈ సమయంలో భారీ వర్షాలు కురవడంతో, చెట్లపై ఉన్న పూత, చిన్న కాయలు రాలిపోతున్నాయి. పూత దశ లోనే పంట దెబ్బతినడం వలన దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధిక వర్షాలతో రాలితున్న కాయ, పూత
పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు

వర్షాలకు తడిసి ముద్దవుతున్న పత్తి నాణ్యత కోల్పోతోంది. తెల్లగా ఉండాల్సిన పత్తి తడిసి పోయి, నల్లబారి పోవడంతో మార్కెట్లో సరైన ధర లభించదని రైతులు వాపోతున్నారు.

తడి పత్తికి గిట్టుబాటు ధర

రాకపోవడం, దిగుబడి కూడా తగ్గడంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని పత్తి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల పత్తి చేలు ఏపుగా పెరిగినప్పటికీ అధిక వర్షాలకు పూత, కాయ రాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

వరుస వర్షాలతో నష్టపోయిన తీవ్రంగా రైతులను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలి. ఈ ఏడాది ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులకు దిగుబడి రాక, నష్టపోయే పరిస్థితి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. పెరిగిన పెట్టుబడులు, కూలీ ఖర్చులు, కౌలు ధరలు పోల్చి చూస్తే ప్రభుత్వం ప్రకటించిన క్వింటా పత్తి ధర రూ.8110లు ఏ మాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం రైతు సంఘాల నేతలతో చర్చలు జరిపి కనీసం క్వింటాకు రూ.10వేలు ఇవ్వాలి. ఎటువంటి నిబంధనలు లేకుండా తడిచిన, రంగు మారిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

-ఏపూరి గోపాలరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రోడ్లపై అడ్డదిడ్డంగా ఆవులు

- **ప్రమాదాలకు గురవుతోన్న వాహనదారులు**
- **నిర్లక్ష్యంగా మున్సిపల్ అధికారులు**



రోడ్డుపై తిష్ట వేసిన ఆవులు



ఆహారం కోసం ప్లాస్టిక్ డబ్బాలో తలదూర్చిన ఆవు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఆవిర్భావం అనంతరం పట్టణంలో రోడ్ల విస్తరణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. పట్టణ ప్రధాన కూడలి మల్లమ్మ సెంటర్‌కు నాలుగు రోడ్లలో ట్రాఫిక్ రద్దీ సమయంలో అరకిలోమీటర్ వరకు వాహనదారులు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్లమ్మ సెంటర్‌లో సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ట్రాఫిక్ పోలీసులకు సైతం సవాలుగా మారింది. ట్రాఫిక్ కష్టాలకు తోడు పట్టణంలోని ప్రధాన రహదారులలో ఆవులు సంచరిస్తూ తిష్ట వేసుకుని పడుకుంటున్నాయి. ఆవుల కారణంగా వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో దుకాణాల యజమానులు సైతం ఆవుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆవులు వీధుల్లో చెత్తకుప్పల వద్దనే ఆహారాన్ని వెతుక్కుంటున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను తినటంతో గోవుల జీర్ణ వ్యవస్థ దెబ్బతిని అనారోగ్య బారిన పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. కొందరు ఆవుల యజమానులు మేత, దాణా ఇవ్వకుండా రోడ్ల పైకి వదిలి వేయడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ గోవుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఆవులను అవుల సత్రంలోకి తరలించాలని ప్రమాదాలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై వాహనాలకు అడ్డంగా...





తుపాను పోయి వారం రోజులవుతున్నా పొలాల్లో ఇంకా నిలిచి ఉన్న వర్షపు నీరు

వర్షం వస్తే... మునగాల్సిందేనా..!

మండలంలోని అనేక గ్రామాల్లో వర్షం పడిన ప్రతిసారీ తమ పంటలు మునిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా పరిష్కారం మాత్రం కావడం లేదు. పాలకులు, ప్రభుత్వాలు, అధికారులు మారినా పంట పొలాల ముంపును మాత్రం ఎవరూ అపడం లేదు. దీంతో రైతులు ప్రతి ఏటా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకుని ముంపు నివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- ప్రజాశక్తి, ప్రత్తిపాడు

- ఊరు చుట్టూ కాల్వలు
- తుంగ పెరిగి నీరు పొంగి పంటల మునక
- హెచ్చరికలే తప్ప పరిష్కారం శూన్యం..
- పట్టించుకోని ప్రభుత్వాలు, అధికారులు



వంగిపురం వద్ద బ్రిడ్జిల గుండా పారుతున్న కాల్వలు, పెరిగిన తుంగ

వర్షాలు పడిన ప్రతి సారీ పంట పొలాలు ముంపుతోనే వంంనంగంతంన్నాంంం. మునిగినపుడు ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తారే తప్ప పరిష్కార మార్గం చూడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఇలా సాగుతోంది. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కునేందుకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి పకడ్బందీగా తగిన చర్యలు తీసుకున్నా వంగిపురంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాలను ప్రతిసారీ ముంచెత్తి నట్లుగానే ఇప్పుడు మునిగిపోయాయి. అసలు నీట మునగడానికి కారణం ప్రత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం గ్రామం చుట్టూ నాలుగు రకాల మురుగు కాల్వలు ఉన్నాయి.

తుగలం కాల్వ : కుర్నూతల, కొత్తమల్లాయపాలెం మీదుగా పుట్ట కోట,పిరంగి పురం వైపు నుండి వచ్చే మురుగు నీరు మొత్తం ఇటే పరూతుంది.

పల్లపాడు వైపు రామ వాగు : కొండ్రుపాడు కొండలు నుండి వర్షపు నీరు,మురుగు నీరు వస్తుంది.

పుసలూరు వైపు పిల్లల వాగు : తుమ్మల పాలెం గొట్టిపాడు,గనీక పూడి,ఉన్నవ మీదుగా వస్తుంది.

మేకల వాగు : గొట్టిపాడు, వరగాని చప్ట మీదుగా మేకల వాగు పారుతుంది.

కాలువలు మురుగు కాలువలు కాగా ఇవన్నీ కూడా కొండ ప్రాంతం నుండి రావడం చేత లోతట్టు గా ఉండటం చేత నీరు పోయే మార్గాలు లేక ఊరికి తూర్పుగా అప్పాపురం చానల్ కాలువ సాగు, త్రాగు నీరు ఉండటం వలన వరదలు వచ్చినపుడు కట్టలు అడ్డు వచ్చి కొంత నీరు అక్కడ చేరి పొలాలు మునిగి పోతున్నాయి. ఊరు పుట్టినప్పటి నుండి అంటే కృష్ణా నది సంఘం జాగర్ల ముడి దగ్గర చీలిన దగ్గర నుండి వంగిపురానికి తూర్పు అప్పాపురం, కృష్ణా కాలువ వరద వచ్చినపుడు అడ్డుగా ఉండటం ఒక కారణం. కాల్వలు అపరిశుభ్రంగా ఉండటం అంటే వరద వచ్చేటపుడు వెంట వచ్చే చెత్త, పెరిగిన పిచ్చి కంప తొలగించక అవి అడ్డు వచ్చి వరద కాల్వలో కాకుండా పొలాల్లో చేరి ముంచెత్తుతోంది. మునిగిన పంట కాల్వలు నాలుగు లేదా ఐదు రోజుల తరబడి నిల్వ ఉంటుంది. అందుకని రైతులు గతం లో మిరప, పత్తి పంటలు సాగు చేసినప్పటికీ ఒక వైపు వైరస్ మరొక వైపు వర్షాలు వరదలు కారణంగా మూడు నెలల పంటలకు ఆ ఊరి రైతులు వరి, శనగ, మినుము ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇవి అన్ని కూడా మూడునెలల పంటలే ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ ఊరు మునగడం మాత్రం ఆగడం లేదు. సమస్య పరిష్కారం చూపడం లేదు. వ్యవసాయం చేసే రైతులు కూడా తగ్గారు. సమస్య పరిష్కారానికి రామవగు, తుగలం కాల్వలు రెండు మారిస్తే కొంత మేర తొలగినట్లు అవుతుంది అక్కడి రైతులు తెలుపుతున్నారు.

వర్షాలతో అన్నదాతకు ఇక్కట్లే..

వర్షాలు పడిన ప్రతి సారి మునిగిన పంట పొలాలు ప్రతి సారి పంట పొలాలు పరిశీలించడం నష్ట నివారణ అంచనా వేయడం. ప్రతిసారీ రూ. లక్షల్లో వంట నష్టం. పాలకులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని రైతుల వాపోతున్నారు. పాతమల్లాయపాలెం, గింజుపల్లి వారి పాలెం, తిమ్మాపురం, వంగిపురం, మేడవారిపాలెంలో పంట కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో వరద నీరు సాఫీగా ముందుకు సాగే మార్గం లేకపోవడంతో ముంపునకు గురవుతన్నాయి. ప్రతి సంవత్సరం మూడు వేల ఎకరాలకు పైగా నీట మునుగుతున్నాయి. ముందుగా వేసిన పంటలు కూడా నష్టాలను సవిచూస్తున్నాయి. అది కూడా ఇ-క్రాప్ చేసిన పంటలకే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతులు పంట నివారణ చర్యలు మని రైతు సేవ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిష్టి

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్టి అన్నారు. ఆదివారం ఆవాజ్ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి షేక్ కాజా అధ్యక్ష వహించారు. చిష్టి మాట్లాడుతూ ఆవాజ్ లౌకిక వాద పరిరక్షణకు పనిచేస్తోందన్నారు. 23 సంవత్సరాలుగా మైనార్టీల అభివృద్ధి, భద్రత కోసం పనిచేస్తోందని వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వానికి పూర్తి మెజార్టీ బిజెపికి లేకపోయినప్పటికీ మతోన్మాద ఎజెండాను అమలు చేయడంలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదని విమర్శించారు. ఈనెల 16వ తేదీన గుంటూరులో జరిగే ఆవాజ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఏడుగురితో కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో ఆవాజ్ జిల్లా కార్యదరి ఎస్.కె.బాషా, జిల్లా అధ్యక్షులు మహబూబ్ సుభాని, ఎండి యూసుఫ్ పాల్గొన్నారు..



రైతులతో కలసి వరి కంకులను పరిశీలిస్తున్న సాంబిరెడ్డి

నష్టపరిహారం ఏదీ..?

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మొంథా తుపాన్ వెళ్లి వారం రోజులు గడుస్తున్నా పంట నమోదుప్రక్రియ చేపట్టి నష్టపరిహారం ఇవ్వకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నేలపాడు, కంచర్లపాలెం పంటపొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. రైతు పాలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 16 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని అందులో ఐదు ఎకరాలకు పైగా పైరు నేల వాలిందన్నారు. సంకరి చింతయ్య, కాకి చంటి, నన్నపనేని సాంబశివరావు, మేకల జయరావు మాట్లాడుతూ ఇంతవరకు పంట నష్టం నమోదు చేయలేదని వాపోయారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన వాస్తవ సాగుదారులను గుర్తించి ఎకరా వరికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజల కోసం పనిచేసిన బూసిరెడ్డి, సాంబశివరావు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి గ్రామానికి చెందిన మొదటి తరం సిపిఎం నాయకులు ఉయ్యూరు భూసిరెడ్డి, ఈమని సాంబశివరావు ప్రజల కోసం పనిచేసిన ధన్యజీవులని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు.ఆదివారం స్థానిక సిపిఎం కార్యాయలంలో బూసిరెడి, సాంబశివరావుల వర్ధంతి నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉండవల్లి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నికరంగా నిలబడి పనిచేసిన ఉయ్యూరు బూసిరెడ్డి, ఈమని సాంబశివరావులు లేని లోటు తీరనిదన్నారు. వారు కడదాక కమ్యూనిస్టులుగా నిలబడ్డారన్నారు. అనేక ఆటుపోట్లు, ఇబ్బందులు ఎదురైన వెనకడుగు వేయలేదని చెప్పారు. వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు సిపిఎం శ్రేణులు మరింత పట్టుదలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు మాట్లాడుతూ పేదలపై, బలహీన వర్గాలపై పెత్తందారుల దాడులను అడ్డుకొని, వారికి అండగా బూసిరెడ్డి, సాంబశివరావులు నిలిచారన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు టి.బక్కిరెడ్డి, సంకురు ఇమ్మానియేల్ రాజు, కె.జగదీశ్వర్ రెడ్డి, కాపారపు రామకృష్ణ, ఆర్.వి.రాఘవయ్య, సిహెచ్. సుందరరావు, ఎస్.కె. ఎర్రపీరు, సైకం వెంకటనారాయణ, పి.గాంధీ, ఓలేటి శ్రీను, కుమార్ తదితరులు పాల్గొని వారు నివాళులర్పించారు.

ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి

సిఐటియు తాడేపల్లి పట్టణ మహాసభలో జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-తాడేపల్లి

పెరిగిన ధరలు కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచాలని సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ సిఐటియు మహాసభ కోట బాబురావు, వేముల రేణుక అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముందుగా సిఐటియు జెండాను జిల్లా కమిటీ సభ్యులు నారిన నాగేశ్వరరావు ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో డిఏ పాయింట్స్ పెంచకుండా కూటమి ప్రభుత్వం 50 లక్షల మంది కార్మికులకు ద్రోహం చేసిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు స్కీం వర్కర్లకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్మికులపై రాజకీయ వేధింపులతో పాటు అక్రమ తొలగింపు ఆపాలని కోరారు. యువగళం పాదయాత్ర సందర్భంగా టిడిపి మేనిఫెస్టోలో దావన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోట్లను తీసుకొచ్చి కార్మికుల ప్రయోజనాలు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం కేంద్రంలోని బిజెపికి వంతపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 23,24 తేదీలలో తాడేపల్లిలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మహాసభలో సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, నారిన నాగేశ్వరరావు, కోట బాబురావు, వేముల రేణుక పాల్గన్నారు. మహాసభ అనంతరం సిఐటియు తాడేపల్లి పట్టణ కన్వీనర్గా వేముల దుర్గారావు, కో కన్వీనర్లుగా కోట బాబురావు, వేముల రేణుక, నారిన నాగేశ్వరరావు, కె.వెంగమ్మతో పాటు 16 మందితో నూతన కమిటీ ఏర్పడింది.



కార్యకర్తలతో మాట్లాడుతున్న బాలసాని కిరణ్‌కుమార్

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బాలసాని కిరణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం కొండె పాడు, కోయవారి పాలెం, తిక్కిరెడ్డి పాలెం, కొత్తమల్లాయపాలెం, యనమదల, ఈదులపాలెం, చిన్నకొండ్రుపాడు, తుమ్మల పాలెం గ్రామాలలో "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్,మండల కన్వీనర్ చల్లా హనుమంత్ యాదవ్, ప్రత్తిపాడు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు

3వ విడత స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర 3వ విడత కార్యక్రమం మాచర్ల జమ్మలమడక రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా శ్మశాన వాటిక ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని ఎత్తి కుప్పలుగా పోసి మున్సిపల్ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. కూనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యంతో మనం జీవించినప్పుడే మహానుభావులు కలలు కన్నా నవభారత నిర్మాణం జరుగుతుందని అన్నారు. సేవాసమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో మహిళలు, యువత స్వచ్ఛందంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సేవాసమితి సభ్యులు పి.హరి బాబు, పి. శ్రీనివాసరావు, పల్నాడు శ్రీనివాసరావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఏ.చంద్రయ్య, ఎం.పాపిరెడ్డి, ఓ.చెన్న కేశవరావు, సిహెచ్. రుక్మిణి, జి.ప్రభావతి, టి.నారాయణమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మండల కమిటీ నాయకులు

కమిటీ నాయకులతో సమావేశం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీని ప్రతిష్ట పరచాలని మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య కోరారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో మండలంలోని అన్నీ కమిటీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, కన్వీనర్లు,గ్రామ ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు, మండలంలోని ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పని చేయాలని సూచించారు. అన్నిగ్రామాల్లో పార్టీని మరింతగా బలపరిచేందురే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ క్లస్టర్ ఇన్చార్జులు వడ్లమూడి అప్పారావు, షేక్ అజ్మల్లా, బెల్లంకొండ రామ గోపాలరావు భాష్యం ఆంజనేయులు గంగాధర్, ముంతాజ్, సాగర్, బాలయ్య, లీలావతి, సుజాత, మండల, గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే జోగి రమేష్ ఆరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వం చట్ట ప్రకారమే పని చేస్తుందని, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిని ఉపేక్షించేదని లేదని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్న మయ్య జిల్లా ములకలచెరువు గ్రామంలో నకిలీ మద్యం తయారు కేసులో వైసిపికి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్, అతని ముఖ్య అనుచరుల పాత్ర వుందని, అందుకు తగిన ఆధారాలు ఉన్నందునే వారిని అరెస్టు చేసినట్లు పేర్కొ న్నారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరి మీద అక్రమ కేసు పెట్టలేదని, ఏ ఒక్కరిని అక్రమంగా అరెస్టు చేయలేదని తెలి పారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొలకలూరులో వీధి కుక్కల స్వైర విహారం

- ఎక్కడో పట్టి గ్రామంలో వదిలానఆరోపణలు
- ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న శునకాలు
- దిగజారిన మురుగునీటి పారుదల వ్యవస్థ



ఎస్సీ కాలనీలో గుంపుగా చేరిన కుక్కలు

ప్రజాశక్తి - తెనాలి

వీధి కుక్కలు స్వైర విహారం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. తరచుగా చిన్నారులు, పాదచారులపై ఎగబడి దాడి చేస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి వీధిలోను గుంపులుగా సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా అరుస్తూ హోరెత్తిస్తున్నాయి. ఇదిలా ఉంటే మరో తవైపు పంచాయితీలో ఏ సమస్య ఎదురైనా సిబ్బందికి పట్టించుకునే తీరికలేకుండా పోయింది. గ్రామంలో మురుగు నీటి పారుదల లేదు. కొన్ని ప్రాంతాలలో రోడ్లు వేశారు కానీ సైడు కాలువలు నిర్మించలేదు. ఫలితంగా కొద్దిపాటి వర్షాలకు కూడా రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కుక్క కాటు ఎంత ప్రమాదకరమైందో తెలిసిందే. అయితే వాటిని అదుపు చేయడంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. ముఖ్యంగా రూరల్ గ్రామం కొలకలూరులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గతంలో ఒకటి, రెండు కుక్కలు మాత్రమే కనిపించే పరిస్థితి. ఇపుడు ప్రతి వీధిలోని పదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. అకస్మాత్తుగా వీటి సంఖ్య ఎలా పెరిగిందన్నది ప్రశ్నార్ధకం. అయితే గతంలో ఈ కుక్కలను తమ వీధులలో చూడలేదని, ఎక్కడి నుంచో తెచ్చి గ్రామంలో వదిలి వెళ్లి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. గ్రామానికి అవి కొత్త కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనాల వెంట పడుతున్నాయి. తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో వీధుల వెంట ఉండే వ్యర్థాల వద్ద ఇవి చేరుతున్నాయి. డస్ట్ బిన్‌లో వ్యర్థాలు వేసేందుకు వచ్చిన వారిపై, ఆ మార్గంలో నడిచి వెళుతున్న వారిపై దాడికి ప్రయత్నిస్తున్నాయి. ఇక రాత్రి వేళల్లో ప్రజలు రోడ్ల వెంట నడవాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో అరుస్తూ నిద్ర లేకుండా చేస్తున్నాయి. మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువలు అస్తవ్యస్తం
పట్టించుకోని కార్యదర్శి

గ్రామంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీనికి తోడు కొందరు స్వప్రయోజనాల కోసం మురుగునీటి వ్యవస్థను మరింత దిగజారుస్తున్నారు. పంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన కార్యదర్శి లేకపోవడం, ఇంచార్జ్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వైవిడి ప్రసాద్ ఫోనులకు స్పందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి అనుమర్లపూడి వెళ్లే డొంక రోడ్డులో క్వారీలలో వర్షాలకు భారీగా నీరు చేరింది. ఓ క్వారీలో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్న వ్యక్తి, క్వారీలో నీటిని ఇంజన్ల సాయంతో గ్రామంలోని సైడ్ కాలువలలోకి ట్యూబుల ద్వారా తరలించారు. దీంతో నీటి ఉధృతి పెరిగి మురుగునీరు మెయిన్ రోడ్డుపై చేరింది. మురుగు కాలువలు పొంగి పొర్లాయి. ఇదేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తే, డెయిరీ ఫామ్ నిర్వా హ కులు దౌర్జన్యానికి దిగారు. ఈ పరిణామాలపై గ్రామ ఇన్చార్జి కార్యదర్శి వైవిడి ప్రసాద్‌కు ఫిర్యాదు చేసేందుకు ఫోనులో ప్రయత్నిస్తే స్పందన లేదు. డివిజనల్ పంచాయతీ అధికారికి, రూరల్ ఎస్సైకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎట్టకేలకు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ స్పందించి డెయిరీ ఫామ్ నిర్వాహకులతో మాట్లాడటంతో సమస్య కొంత పరిష్కారమైంది.. అయితే అత్యవసర పరిస్థితుల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు ఫోన్‌కు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల పంచాయితీ నిధులు దుర్వినియోగంపైనా స్థానికులు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పంచాయతీలో నిధుల దుర్వినియోగం అరికట్టి, పాలనను గాడిలో పెట్టేందుకు రెగ్యులర్ కార్యదర్శులు నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



పొంగి రోడ్డుపైకి చేరిన మురుగునీరు

అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని యువజన నగర్‌లో ఆదివారం గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ రూ.52 లక్షల సిఎస్ఆర్ నిధులతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విదేశాలలో వున్న తెలుగువారి సహకారంతో అనిల్ యర్ర రెడ్డి కంపెనీ నుంచి నిధులతో ఈ ప్రాంత దశబ్దాల కాలం నాటి కల నెరవేరిం దన్నారు. ఈ ఏరియాలో గోడ కూలి చనిపోయిన ఇద్దరు చిన్నారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా, తల్లికి వదనం ద్వారా 325 మంది పిల్లల తల్లులకు ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున అకౌంటులో జమ చేశామన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేద వారికి పనులు లేకుండా చాలా ఇబ్బంది పడ్డారనీ కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ అనేక పనులు ఉంటున్నాయని చదువుకున్న పిల్లలు విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లకుండా ఈ రాష్ట్రంలో అనేక పరిశ్రమలు తీసుకొచ్చేందుకు అనేక కంపెనీలతో ఒప్పందాలు కుదిరించుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరకాకాని మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకష్ణ,మండల కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి- తాడేపల్లి

రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి వద్ద గుంటూరుకు మంచి నీటి సరఫరా అయ్యే కాలువకు రెండు వైపుల చెత్త, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. గమనించిన ఉండవల్లి టీడీపీ యువ నాయకుడు కునపరెడ్డి ప్రదీప్ వారి మిత్ర బృందంతో ఆదివారం పిచ్చి మొక్కలు తొలిగించే ప్రక్రియ చేపట్టారు. పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బం దిగా మారుతున్నాయని స్థానికులు తెలపడంతో తమ వంతు సహాయంగా పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కునపరెడ్డి పవన్ కుమార్,ఉండవల్లి దుర్గ ఫణి కుమార్, సాయి, కౌశిక్, వినోద్ పాల్గొన్నారు.



జెసిబితో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉండవల్లి కునపరెడ్డి ప్రదీప్



డిప్యూటి కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏకాగ్రతతో చదువుకోండి
డిప్యూటీ కలెక్టర్ కె.చంద్రశేఖరరావు

ప్రజాశక్తి - రెంటచింతల

ఏకాగ్రతతో చదువుకోవాలని బట్టి పట్టే పద్ధతి పనికిరాదని మచిలీపట్టణం డిప్యూటీ కలెక్టర్ కట్టమూరి చంద్రశేఖర్ రావు అన్నారు. ఆదివారం రాత్రి పాఠశాల పూర్వ విద్యార్థిగా స్థానిక వైఆర్ఎస్ హైస్కూలును సందర్శించి టెన్త్ విద్యార్థులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్ఎం కె.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజున కష్టపడ్డామంటే భవిష్యత్‌లో సుఖపడొచ్చని పేర్కొన్నారు. అనంతరం గతించిన టీచర్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రతి ఏటా అన్‌ఎయిడెడ్ టీచర్ల భతి కోసం రూ.72 వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. డిప్యూటి కలెక్టర్ దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె. నూతన్, ఓ. వెంకటేశ్వర రావు, బి.ఈశ్వరరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

పలువురికి అన్నదానం

ప్రజాశక్తి - రెంటచింతల

అన్నదానం పరబ్రహ్మ స్వరూపమనీ, ఆకలితో ఉన్న వారికి కడుపునిండా ఆహారం పెట్టడం వల్ల అత్యంత మహోన్నతమైన ఫలితాలు లభిస్తాయని సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య అన్నారు. కార్తీక మాసం ఉత్స వాల్లో భాగంగా కష్ణానది తీరాన ఉన్న సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి సన్నిధిలో వివిధ మాలలు ధరించిన స్వాములకు ఆదివారం భారీగా అన్నదానం చేశారు. దాతలు మొక్కపాటి శ్రీనివాస్, నాగ మల్లేశ్వరీ, నీలం పెద వెంకటేశ్వర్లు, చెన్నమ్మ, కె. భవానీ శంకర్, నాగలక్ష్మి దంపతులను సన్మానించారు. ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న బైకు దొంగతనాలు



ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో ఇటీవల వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాలు బెంబేలెత్తిస్తున్నాయి. పోలీసులు నిఘా ఉంచిన దొంగలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తమ హస్త లాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆదివారం సుందరయ్య నగర్ లో సరికొండ పద్మావతిఇంటి ముందు పార్కు చేసిన టు వీలర్ బైక్ను దొంగలు ఎత్తుకుపోయారు. బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాడేపల్లి పట్టణం పక్కనే ఉన్న రాజధాని గ్రామాలైన ఉండవల్లి పెనుమకల్లో నెలరోజుల వ్యవధిలో20 దాకా ద్విచక్ర వాహనాలు దొంగలు ఎత్తుకెళ్లారంటే ఆశ్చర్యంగా కలుగక మానదు. ఎన్టీఆర్ కట్టమీద నివాసం... యువకుడు మోటార్ సైకిల్ ను గత నెలలో దొంగలు ఎత్తుకుపోయారు. కృష్ణాజిల్లా ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో ఆ యువకుడు బండి ప్రత్యక్షమైంది. బిట్ర రామారావు అనే యువకుడు హీరో హోండాబండి తాడేపల్లిలో మాయమై నాలుగు నెలల అనంతరం కఅష్ణాజిల్లా చల్లపల్లిలో దొరికింది. వడ్డెరపాలెంలో నివాసం ఉంటున్న మరొక వ్యక్తి టు వీలర్ అదఅశ్యమైంది. రెండు నెలలు గడి చిన ఇంతవరకు ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులను అడిగితే విచారణ చేస్తున్నామని చెబుతున్నారు. ఫైనాన్స్ కింద టూ వీలర్ కొనుగోలు చేసిన వారు తమ వాహనం దొంగతనాన్ని గుర్తైతే, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, వెంటనే ఎఫ్ ఐ ఆర్ ఇవ్వమని అడుగుతున్నారు. పోలీసులు కొంత సమయం తీసుకుని చూద్దాం అంటున్నారు. ముఖ్యంగా తాపీ పని ఇతర రోజువారీ పనులు చేసుకునేవారు తమ వాహనం పోయిన వెంటనే ఎఫ్ ఐ ఆర్ పోలీసుల అందజేస్తే కంపెనీ యాజమాన్యం నెల నెల కట్టవలసిన వాయిదాలు నిలుపుదల చేసే అవకాశం ఉంది. బైక్ దొరికితేన్యాయ స్థానంలో జడ్జి ముందు పెట్టి వాహనదారుడికి అప్పజెప్పవలసి వస్తుంది. రోజుల తరబడి పోలీస్ స్టేషన్లో, కోర్టులు చుట్టూ తిరగలేకపోతున్నామని అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి నివాసము న్న ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ మరింత పెంచాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. ఆ మేరకు పోలీసులు చర్యలు తీసుకొని తాడేపల్లి లో జరుగుతున్న బైక్ దొంగతనాలు ను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అన్నందానం చేస్తున్న రమేష్‌బాబు

శివ భక్త బృందం అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం స్వామివారి రథం ఎదుట శివ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రతి నెలా జరిగే అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు మాట్లాడారు. యాత్రికుల సహకారంతో రామాంజనేయులు కుటుంబం సుమారు 34 సంవత్సరాల నుంచి ప్రతి నెలలో అమావాస్యకు సమీపంలో వచ్చే ఒక ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించుకుంటూ రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో శివాలయం ట్రస్టు బోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు, భక్త బృందం ప్రతినిధులు గుండా రామాంజనేయులు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, గోవాడ రవి, కదం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత వెలగపాటి కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి



వెలగపాటి (ఫైల్)

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, సీనియర్ నాయకులు వెలగపాటి విలియం గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున చినకాకాని ఎన్నారై హాస్పటల్లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన వయసు(76) సంవత్సరాలు, భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం సాయంత్రం విలియంకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు తరలించారు. హాస్పటల్లో చికిత్స పొందుతూ తెల్లవారుజామున కన్నుమూశారు. నాలుగు సార్లు పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసి పార్టీలో నాయకుల మన్ననలు పొందారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాగా విలియం భౌతికాయాన్ని పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయం

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్తీక మాస రెండవ ఆదివారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఆలయానికి విచ్చేసి కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లీలా కుమార్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం మండలంలోని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్తీకమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

పత్తికి క్వింటా రూ.12వేలకు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - తాడికొండ

మొంథ తుపాను వల్ల దెబ్బతిన్న పత్తిని క్వింటాకు రూ.12 వేలకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. పొన్నెకల్లు గ్రామంలో ఆదివారం రైతులతో కలిసి క్షేత్ర పర్యటన చేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తుఫాను వల్ల పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు త్వరితగతిన తాడికొండ మార్కెట్ యార్డులో సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవలే గుంటూరులో సిసిఐ జనరల్ మేనేజర్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ శివశంకర్ రావు, రైతులు దామినేని వెంకటేశ్వర్లు, అన్నే నాగేశ్వరరావు, గుర్రం రాజేంద్రప్రసాద్, పాలేటి రాఘవరావు రేపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న నాయకులు

వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మంగళగిరి

ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అవ్వారు కృష్ణ, గౌరవాధ్యక్షులుగా పూర్వపు అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆలేటి పూర్ణ, చంద్ర, కె.వి.వెంకట దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా కె.శంకరరెడ్డి, సహాయ కార్యదర్శులుగా డోగిపర్తి నరేంద్ర, బాణాల నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా నేరెళ్ల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా కుక్కమళ్ళ ప్రభాకర్, షేక్ అహ్మద్ షరీఫ్, తిరువీధుల నరసింహమూర్తి, కనిగిరి శ్రీరాములు, రుద్రు మోహన్, సలహా కమిటీ సభ్యులుగా మంచా విజయ్ మోహన్, జిలాని, అంకం శ్రీనివాసరావు (బాబు), ఎలీషా, విఠల్ రావు, వీసం వెంకటేశ్వరరావు, హరిశ్చంద్ర ప్రసాద్, బాణాల రామారావు, కొమ్మారెడ్డి వీరారెడ్డి, జంజనం వెంకట సాంబశివరావు, గోలి బాలమోహన్, షేక్ హుస్సేన్ లను ఎన్నుకున్నారు. ప్రస్తుత కార్యవర్గ కాల పరిమితి రెండేళ్ల పాటు ఉంటుందని వీసం వెంకటేశ్వరరావు తెలిపారు. వాకర్స్ మధ్య ఏర్పడిన విభేదాలను పీకే కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ పూర్వపు గౌరవాధ్యక్షులు తాజా సలహా కమిటీ సభ్యులు మంచా విజయ్ మోహన్ రావు పరిష్కరించి సమన్వయం చేశారు.



వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సమాజం పట్ల యువత స్పందన అభినందనీయం

ప్రజాశక్తి - తెనాలి

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే యువత స్ఫూర్తి అభినందనీయమని సెర్ప్ బాపట్ల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కొత్తపల్లి రవీంద్రబాబు అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగజ్జీవన్ రామ్ రీడింగ్ రూము ప్రాంగణంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మంచికలపూడి దానియేలు స్మారకంగా ఆదివారం సహాయా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సీనియర్ ఇ.ఎన్.టి సర్జన్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ చిరు ఉద్యోగాలు చేస్తూనే, సమాజ సేవలో అంకితం కావాలన్న భావన గొప్పదన్నారు. శిబిరం నిర్వహణకు చేయూతనిచ్చిన కె.బేబీ పాల్, నలుకుర్తి విమలమ్మ ను అభినందించారు. డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఏ రుగ్మతనూ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఖరీదైన వైద్య సేవలు అందించేందుకు సహాయా ట్రస్ట్ చొరవ ప్రశంసనీయ మన్నారు. శిబిరంలో వినికిడి వినికిడి సమస్యలను ఆడియాలజిస్ట్ రాజేష్ పరీక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జన్నలగడ్డ అనుపమ్, సెక్రటరీ ఎం. రవికుమార్, కోశాధికారి డాక్టర్ పూజిత, ట్రస్ట్ సభ్యులు ఎం.డాని ఆశిష్, హర్షవర్ధన్, ఎం.కృష్ణవేణి, ఎం.సాయికృప, ఎస్.ప్రదీప్, ఎం.శ్యామ్ సాగర్ ఎస్.మురళీధర్, వినయకుమార్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జోగి రమేష్ అరెస్ట్ అక్రమం

ప్రజాశక్తి - తాడేపల్లి

మాజీ మంత్రి జోగిరమేష్ ను కూటం ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని వైసిపి మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతి రెడ్డి వేమారెడ్డి విమర్శించారు. చంద్రబాబు డైవర్షన్ డ్రామాలకు ప్లాన్ చేసుకుంటున్నారుఅని ధ్వజమెత్తారు. ఆదివారం దొంతి రెడ్డి వేమారెడ్డి తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

జోగి అరెస్టు సబబే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌ను అరెస్టు చేయడం సబబేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో కొంత మంది అక్రమార్కులతో కలిసి జోగి రమేష్ నకిలీ మద్యం తయారు చేసి ఎంతో మంది పేదల ప్రాణాలను బలిగొన్నారని ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అరెస్టు అయిన నిందితులతో రమేష్‌కు సంబంధాలు ఉన్నాయన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

334వ రోజు సిమెంట్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 334 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, వై.సాంబశివరావు, ఎం.సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, ప్రారంభించారు. దీక్షల్లో బొందలపాటి నవనీతమ్మ, మొలక శారదా, దేరంగుల రమణమ్మ, గొర్రెముచ్చు అన్నమ్మ, వేము రిబ్కా కూర్చున్నారు. కార్యక్రమంలో బి.ఎస్.సింగ్, రహంతుల్లా, బాషా, వై.సుబ్బా రావు, బి.అంకయ్య, దుర్గాభవాని, బుధమ్మ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎర్రన్నాయుడు వర్ధంతి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆదివారం దివంగత నేత, కేంద్ర మాజీమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక సచివాలయం సమీపంలో, మందడంలో సీనియర్ న్యాయవాది, జర్నలిస్టు వి.ఆదినారాయణ, రాజధాని రైతులు ఆయన చిత్ర పటానికి ఘన నివాళి అర్పించారు. ఎర్రన్నాయుడు విలక్షణ నేతగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేయించుకొన్నారని కొనియాడారు. ఆదినారాయణతో పాటు రాజధాని రైతులు కట్టా రాజేంద్ర, వీరబాబు, బెజవాడ సాంబయ్య, పాతూరి రాంబాబు, బుల్లయ్య, ఓసిసి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి వేడుకలను ఆదివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయం ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోశాల రాఘవ, వడిశా నరేష్, నేరెళ్ల బాలాజీ, రుద్రు శ్రీను, ఎం.డి.ఆరిఫ్, ఎం.డి.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సహజ ఆరోగ్యానికి ఆయుర్వేదం మేలు

ప్రజాశక్తి - తెనాలి

సహజ ఆరోగ్యానికి ఆయుర్వేదం మేలని, జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొదించుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జై మహిత చెప్పారు. స్థానిక చెంచుపేటలోని వాకర్స్ క్లబ్ తెనాలి -2 కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. డాక్టర్ మహిత ముఖ్యఅతిథిగా పాల్గని ఆయుర్వేద వైద్యంలో మెళుకువలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహితను సత్కరించారు. కశ్యప్ ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకురాలు సాకృత, నన్నపనేని దివ్య ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆనందరావు, భుజంగ రావు, మురహరిరావు, సత్యనారాయణ రాజు, పూర్ణచంద్ర రావు, రావి సుబ్బారావు, తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.



క్రీడాకారులతో క్రాంతికుమార్

చదువుతోపాటు ఫిట్‌నెస్ అవసరం

ప్రజాశక్తి - గుంటూరు

విద్యార్థులకు చదవుతో పాటు ఫిట్‌నెస్ అవసరమని గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. ఆదివార విద్యానగర్‌లోని గ్రాస్ కోర్ట్‌లో ఎఎఫ్‌సి, టిఎన్‌ఆర్ ఫుట్‌బాల్ అకాడమీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. అనంతనం అకాడమీ క్రీడాకారులకు యూనిఫామ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రిడాకారులకు చదువుతోపాటు ఫుట్‌బాల్ శిక్షణ, ఫిట్‌నెస్ ఎంతో అవసరం అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ అకాడమీలో చేర్పించి, కోచ్ బ్రహ్మం ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించడంతో మెలుకువలు నేర్చుకుంటున్నారన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్ నేషనల్ టీంకి గుంటూరు నుండి ఈ అకాడమీ క్రీడాకారుడు అనీష్ చతిష్‌గడ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు పెనుమాక హై స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- తాడేపల్లి

సోమవారం నుండి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే అండర్ -17 బాలబాలికల స్విమ్మింగ్ పోటీలకు పెనుమా హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జి.అంనతశివ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పోటీలో 5వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పోటీలలో గుంటూరు జిల్లా తరపున వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెనుమాక విద్యార్థులు ఐ.కళ్యాణ్‌నాయక్, కె.చరణ్, ఐ.చరణ్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్ బాబు, జి.జితేంద్రకుమార్, కె.నాగరాజులను, విద్యార్థులను స్కూలు ఎస్ఎంసి చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు



విద్యార్థులతో ఉపాధ్యాయులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటునన మాదల చైతన్య

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - గుంటూరు

క్రీడలతో శారీరక, మానసిఉల్లాం కలుగుతుందని మాదల చైతన్య అన్నారు. జయశ్రీ మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ట్రస్ట్ చైర్మన్, జనచైతన్య గ్రూప్ అధినేత మాదల చైతన్య ఆదివారం ప్రారంభించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో టాస్ వేసి మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు ఈ సందర్భంగా మాదల చైతన్య మాట్లాడుతూ ఈటోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి, ద్వితీయ బహుమ తులను మాదల జయశ్రీ మెమోరియల్ నుండి అందిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్ శాఖ, ప్రైవేట్ ఉద్యోగులు, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయ మన్నారు. 12 టీములతో వారంతా విరామం రోజులలో రెండు నెలలపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చలపతి అధినేత ఆంజనేయులుకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-సత్తెనపల్లి



చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులుకు అమెరికాలోని వెర్మంట్‌లో ఉన్న బర్లింగ్లన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. విద్యా, సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ఇచ్చింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్దే లక్ష్యంగా కేజీ నుండి పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాలను స్థాపించి విద్యా ప్రదాతగా చలపతి ఆంజనేయులు పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవ చేశారు. యలమంచిలి ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం,ఆధ్యాత్మికం పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి వైవి ఆంజనేయులుకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని చలపతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కంటే రంగారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - మంగళగిరి

పేదల నేత కంటే రంగారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సిపిఎం కార్యాయలంలో కంటే రంగారావు 39వ వర్ధంతి సభ జరిగింది. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ మంగళగిరి పరిసర ప్రాంతాల్లో కంటే రంగారావు పేదల తరపున అనేక పోరాటాలు చేశారన్నారు. ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేసి కాలనీల ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. మంగళగిరి పట్టణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొని యాడారు. చనిపోయేవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. రంగారావు ఆశయాల మేరకు ఇళ్ల స్థలాల కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పరిపాలన చేస్తుందని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న శుంకాల వలన భారత దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. దీన్ని ప్రశ్నించే స్థాయిలో మోడీ లేడని అన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను అమలు చేస్తూ పనిచ ేస్తుందని విమర్శించారు. అందులో భాగంగా 13 గంటల పని విధానాన్ని తీసుకురావడం జరిగిందని విమర్శిం చారు. సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు మాట్లాడుతూ మంగళ గిరి ప్రాంతంలో పేద ప్రజల కోసం నిరంతరం పాటుబడిన మహనీయుడు కంటే రంగారావు అని అన్నారు. నిరంతరం పేద ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేసేవారని అన్నారు. తాడేపల్లి మండల సిపిఎం నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ కంటే రంగారావుతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు వచ్చి అడిగితే వెంటనే స్పందించే మంచి వ్యక్తి రంగారావు అని అన్నారు. ఇప్పటికీ వారి కుటుంబ సభ్యులు పార్టీలో కొనసాగుతూ పార్టీకి అండదండగా ఉంటున్నారని అన్నారు. సభలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, సీనియర్ నాయ కులు పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ జానీ భాష, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. రంగారావు చిత్ర పటానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామారావు, సిపిఎం నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు

మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ నిహారిక

మన శరీరంలో రక్తాన్ని శుద్ధిచేసి, అవయవాలకు పరిశుభ్రమైన రక్తాన్ని అందించే ముఖ్యమైన విధి నిర్వహిస్తున్న మూత్రపిండాల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జొన్నలగడ్డ నీహారిక అన్నారు. స్థానిక అవగాహన కార్యాలయంలో ఆదివారం అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారిక మాట్లాడుతూ సాధారణంగా రెండు మూత్రపిండాలలో ఒకటి సరిగా పనిచేసినా ఏ సమస్య ఉండదని, అందువల్లే కొంతమందిలో పుట్టుకతో ఒక మూత్రపిండంతో జన్మించినా, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల ఒక మూత్రపిండం దెబ్బతిన్నా చాలామంది ఆరోగ్యంగా జీవించగలుగుతున్నారన్నారు. మూత్రం ఎక్కువగా వచ్చినా లేదా తక్కువగా వచ్చినా కిడ్నీ సమస్యగా గుర్తించి నెఫ్రాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు. మధుమేహంతో ఎక్కువ కాలం ఇబ్బంది పడుతున్న వారు, మధుమేహం అదుపులో లేనివారు సాధారణంగా కిడ్నీ వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సంవత్సరానికి ఒకసారి కిడ్నీ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటే మంచిదన్నారు. కిడ్నీలో రాళ్ల గురించి వివరిస్తూ నీరు తక్కువగా త్రాగటం వల్ల, వివిధ రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కూడా కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని, అవి ఏర్పడ్డ ప్రదేశాన్ని బట్టి వాటి పరిమాణాన్ని బట్టి కొన్ని మూత్రం ద్వారా బయటికి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారికను అవగాహన సభ్యులు ఘనంగా సన్మానించారు. సభకు కోఆర్డినేటర్‌గా టి.వి.సాయిరాం వ్యవహరించగా, అవగాహనసంస్థ సీనియర్ సభ్యులు ఎ.విజయలక్ష్మి, ఆర్.వెంకరత్నం, జీవనసంధ్య అధ్యక్షులు సిరసవల్లి కృష్ణారావు తదితరులు ప్రసంగించారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పరిపాలన సౌలభ్యం దఅష్ట్యా గుంటూరు కార్పొరేషన్‌లో పలువురు సూపరింటెండెం ట్‌లను బదిలీ చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఎలక్షన్స్ సెల్‌కు సూపరింటెండెంట్ పనిచేస్తున్న షేక్ బాలాజీ బాషాను టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సూపరింటెం డెంట్‌గా నియమించారు. ప్రస్తుతం కమిషనర్ పేషిలో పనిచేస్తున్న ఎస్ఎన్.ప్రసాద్ ను తన రెగ్యులర్ విధులకు అదనంగా అకౌంటెంట్-1గా అదనపు విధులు కూడా కేటాయించారు. ప్రస్తుతం అకౌంటెంట్-1గా పనిచేస్తున్న సూపరింటెండెంట్ పి.నమ్రత్ కుమార్‌ను బదిలీ చేసి మేనేజర్‌గా నియమించారు.



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణంరాజు

ప్రకృతిని కాపాడితే భవిష్యత్ సురక్షితం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రకృతిని కాపాడుకొని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ కాలేజీలో నవంబర్ 2న ఎన్ఎంఎంఎస్ శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చైతన్య సదస్సు నిర్వహించారు. డాక్టర్ కఅష్ణంరాజు మాట్లాడుతూ భూమి మనకు లభించిన వరం అని దాన్ని కాపాడకపోతే మన భవిష్యత్ సంతతికి జీవనాధారం ఉండదని హితువుపలికారు. ప్లాస్టిక్ వినియో గాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా యువతను వ్యవసాయం పట్ల ఆకర్షించాలన్నారు. విద్యార్థులు వారి కుటుంబాల్లో చిన్నచిన్న పర్యావరణ అనుకూల మార్పులుచేసి పెద్ద ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. సమాజంలో మానవతా విలువ లను, సేవా తత్పరతను, పర్యావరణ పట్ల ప్రేమను పెంపొం దించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుందని సెక్రెటరీ కె.సతీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, ప్రెసిడెంట్ కోటా శ్రీనివాసరావు, డైరెక్టర్ వుప్పాల సాంబశివ రావు, జి.ఆనంద్, చావా శివాజీ, కె.పావని, రిసోర్స్ పర్సన్స్ గేరా ప్రకాష్, బేతపూడి మంగారావు, రెహమాన్, ఆదినారా యణ, జగదీష్, అరుణాచలం, ఎం. రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాహితీ వైద్యుడు రమణ యశస్వి

- రమణ యశస్వి ఆత్మీయ సత్కార సభలో వక్తలు
- 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు' పోస్టర్ ఆవిష్కరించిన పెనుగొండ
- ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ ఘనతను చాటిన కవుల స్వీయకవితాగానం
- పాల్గొన్న ప్రతి కవికీ నగదు పారితోషికం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వక్తలు, డాక్టర్ రమణ యశస్వి

ప్రజాశక్తి - గుంటూరు

అటు వైద్యం.. ఇటు సాహిత్యం రెండింటినీ కుంటుపడకుండా నడిపిస్తున్న సాహితీ వైద్యుడు రమణ యశస్వి అని వక్తలు ప్రశంసించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌హెచ్‌వో హాలులో జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఆత్మీయ సత్కారం సభ జరిగింది. ఈ సందర్భంగా జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు-2025 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ- వైద్యం కార్పొరేట్ చేతిలోకెళ్ళి పేదవాడికి అందక ఇబ్బందులు పడుతున్న సమయంలో రమణ యశస్వి సూపరింటె ండెంట్‌గా రావడం మంచి పరిణామమన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ సభాధ్యక్షత వహించిన ఈ సభలో రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు, అబాబీలు రూపశిల్పి, సుప్రసిద్ధ సాహితీవేత్త షేక్ కరీముల్లా, కాలమిస్ట్ యేమినేని వెంకటరమణ పాల్గొన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు' పోస్టర్‌ను పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. డాక్టర్ రమణయశస్వి మాట్లాడుతూ సంవత్సర కాలంగా వఅత్తిలో ఎంతో ఒత్తిడికి గురవుతున్న నాకు ఈ ఆత్మీయ సత్కారం ఒక గొప్ప ఊరటనిచ్చిందన్నారు. అనంతరం జరిగిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ కవి సమ్మేళనంలో పలువురు కవులు స్వీయ కవితాగానం చేశారు. పాల్గొన్న ప్రతి కవికీ నగదు పారితోషికం ఇచ్చి, రామరాజు శ్రీనివాసరావు కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. బండికల్లు జమదగ్ని అతిథులకు స్వాగతం పలుకగా, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి సయ్యద్ జానీబాషా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.